క్లుప్తంగా

పోషకాహార లోపాన్ని తగ్గించాలి



విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో పోషణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుదీర్, సుచిత్ర, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ ఆడపిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి పోషణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత ఆరోగ్యం, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై దృష్టి సారించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఈవో రమాబాయికి సత్కారం



రమాబాయిని సత్కరిస్తున్న అర్చకుడు నటరాజన్

సీతంపేట : దేవదాయ శాఖ పరిధిలో గల దుర్గా గణపతి, పార్వతీశ్వరాలయం, ఎరుకుమాంబ ఆలయాల ఈవో జి.వి.రమాబాయి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక దుర్గా గణపతి ఆలయంలో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నటరాజన్ చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఉత్సవ సేవా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాక్‌థాన్‌లో పాల్గొన్న డీఆర్‌ఎం, అధికారులు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, ప్రయాణికులు, ప్రజల్లో స్వచ్ఛతా ఉద్యమంపై అవగాహన కల్పించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బొహ్రా నాయకత్వంలో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ఇండోర్ స్టేడియం నుండి డీఆర్‌ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఈ వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత అనేది కేవలం బాహ్య శుభ్రత మాత్రమే కాదని, దీనిని ఒక అలవాటుగా చేసుకుని ఆరోగ్యకరంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ. శాంతారాం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ప్రవీణ్ భటి, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్, స్పోర్ట్ ఆఫీసర్ ఎం. హరనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : విశాఖ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 21 అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో కె.సీలిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 3వ తేదీ నుంచి 14 వరకు సమర్పించాలని సూచించారు. ఖాళీలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని నివాసితులే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

భానోజీరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీ నగర్ భూదాత భానోజీరావు జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. భానోజీనగర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు మాట్లాడుతూ భానోజీరావు వల్ల వందల కుటుంబాలకు నివాసం లభించిందని కొనియాడారు.



శ్రీలలితాపీఠంలో మహిషాసురమర్దిని అలంకరణలో లలితాదేవి



మహిషాసురమర్దినిగా లలితాదేవి



51వ వార్డు సీతన్నగార్డెన్స్‌లో మహిషాసురమర్దినిగా అమ్మవారు



శ్రీలలితాపీఠంలో మహాలక్ష్మి అలంకరణలో పద్మావతి అమ్మవారు

మహిషాసురమర్దిని... నమోస్తుతే

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సహస్రనామ కుంకుమార్చన చేశారు. అమ్మవారికి వడలు ప్రసాదంగా సమర్పించారు. అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ పర్యవేక్షణలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిషాసురమర్దినీ నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని ప్రస్తుతించగా ఆలయ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. లలితాదేవి విగ్రహ దాత దివంగత సనపల సత్యనారాయణ, కృష్ణవేణి దంపతుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తాంబూళాలు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులను సత్కరించారు. నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు సీతన్నగార్డెన్స్‌లో కొలువైన కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గా దేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



దుర్గాదేవికి పూజలు చేస్తున్న గుజ్జు వెంకటరెడ్డి, భక్తులు

దుర్గమ్మ తల్లికి భక్తుల విశేష పూజలు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో పద్మావతి అమ్మవారు వ్యూహలక్ష్మీ దేవి అలంకరణలో, శ్రీలలితాదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల మధ్య వనదుర్గా హోమం, శ్రీవిద్యా హోమం శాస్త్రోక్తకంగా జరిపించారు. మధ్యాహ్నం భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించారు. గురువారం ఉదయం 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి, చండీ హోమం, లఘు పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి పీఠంలో జరుగుతాయని మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.



శ్రీలలితాపీఠంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శాంతి స్వరూపిణి ఆలయంలో..

పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గా దేవి ఆలయంలో బుధవారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

ఆధ్యాత్మిక స్తోత్ర రత్నావళి ఆవిష్కరణ

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక స్తోత్ర రత్నావళి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉదయం నుంచి పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వేద మంత్రోచ్చరణ మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రదక్షిణ చేయించి, సామ్రాజ్య లక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కె.శివరామప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక స్తోత్ర రత్నావళి ఆవిష్కరిస్తున్న శివరామప్రసాద్, ప్రసాద్

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

కంచరపాలెం: బాపూజీనగర్‌లోని దుర్గా ఫ్రెండ్స్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ శాఖ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న డాక్టర్ కేజీ వేణు

సీతంపేట : సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం, కమనీయ రసాత్మక సాహిత్య ప్రక్రియ అన్నారు. కవి ప్రతిభకు కవితా రీతులు, కవిత్వ పటుత్వం గీటురాళ్లు అన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వ తత్వాన్ని వివరించారు. అనంతరం పలువురు కవులు తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, చల్లా రాంబాబు, సోమంచి వినయభూషణరావు, డి.ఎస్.కుమార్, సీహెచ్ చినసూర్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



భీమునిపట్నం: పారిశుధ్య కార్మికులను భీమిలిలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడి రెల్లి వీధి వద్ద జరిగిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పాల్గొన్నారు. తొలుత ఒక రోజు ముందుగా మహాత్మాగాంధీ జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేసే పని ఎంతో గొప్పదని, దాన్ని అందరూ గుర్తించి వారిని గౌరవించాలని కోరారు. అలాగే పారిశుధ్య సిబ్బంది కూడా తమ విధులను బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య అధికారి బి.మహాలక్ష్మినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ సంస్థలపై ఇంత ప్రేమెందుకు?

ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు సూటి ప్రశ్న

మహారాణిపేట: విశాఖలో అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ని రద్దు చేయాలని, ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే నిలిపేయాలని ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుజరాత్, హర్యానా, తెలంగాణలో అదానీ గ్రూపు సిమెంట్ పరిశ్రమలు మూతపడుతున్నా ఏపీలో మాత్రం పోలీస్ పహారాలో జనావాసాల మధ్య ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం గుజరాత్ ప్రభుత్వానికి ఉన్న అనుమతులను బూచిగా చూపి ఏపీలో పరిశ్రమలు పెట్టడానికి ఏ రకంగా ముందుకు వస్తారని రామారావు అన్నారు. క్లింకర్, జిప్సం, ఫ్లైయాష్, స్లాగ్, బొగ్గు వంటి వ్యర్థాలు విడుదలవుతాయని అన్నారు. ఎస్‌వో2 వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే కార్బన్, ఇతర వస్తువుల వల్ల భూగర్భ జలాలు దెబ్బతింటున్నాయన్నారు. రైతులు, మత్స్యకారులు గంగవరం పోర్టు కోసం భూములిచ్చారే గానీ సిమెంట్ పరిశ్రమ కోసం కాదన్నారు. గుజరాత్ ప్రభుత్వం అనుమతులతో ఈ ప్రాజెక్ట్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె. రామచంద్ర మూర్తి, ఆర్. తాతారావు, బి. నీలకంఠం, ఎస్. జగదీష్, వడ్డాది శివ, జి. సుమతి, బి. రాంబాబు, జె. ఫణి ప్రియాంక, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ధ్యాన మందిరంలో రెండో రోజూ విశేష పూజలు



శారదామాతకు పూజలు చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో బుధవారం భక్తులు స్వహస్తాలతో కుంజర మహాగణపతి, శ్రీ శారదామాత అమ్మవారికి, శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా కుంకుమపూజలు, సహస్ర నామార్చాన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, బాబా వారి గీతాలాపన (భజన), పుణ్యాహవచనం, నవగ్రహారాధాన, పంచగవ్యం, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. దసరా పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం అనంతరం బాబా వారి 107వ మహాసమాధి (పుణ్యతిథి) సందర్భంగా భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతాయని, కాశీ హరిద్వార్ నుండి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను బాబాకు అభిషేకించిన తర్వాత భక్తులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు కంకణాలు, సాయిబాబా ఫొటో, షిర్డీ నుండి తీసుకొచ్చిన విభూతి భక్తులకు అందించనున్నట్లు తెలిపారు.

వృద్ధుల సేవలో వాకర్స్



వృద్ధులతో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులకు తమవంతుగా సాయం అందించారు. మురళీనగర్ పరిసరాల్లో నివసిస్తున్న పేద వృద్ధులకు నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ - 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, ఆర్‌సీ - 5 యు.శుభ, కె.భవానీశంకర్, ఎస్.వరప్రసాద్, సీహెచ్‌ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, ఎన్.ప్రకాశరావు, రోణంకి నాగేశ్వరరావు, పి.గిరిధర్, వర్మ, ఎస్.ఉమాపతి పాల్గొన్నారు.

సేవామణులకు సత్కారం

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్‌కు నిత్యం అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో భాగంగా పూర్వ అధ్యక్షురాలు ఎం.శేషామణి, ఆంధ్ర లక్ష్మిని సభ్యులు సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల కోలాటం

పీఎం పాలెం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించించి. ముఖ్యంగా తెలుగునాట అంతటా మార్మోగుతున్న రఘుకుల తిలకా రారా గీతానికి చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం హైలెట్‌గా నిలిచింది. జానపద నృత్యం ప్రదర్శించిన కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. డి.మీనా నృత్య దర్శకత్వంలో కళాకారులు బిందుశ్రీ, యోగిని, లక్ష్మీ ప్రియ, కుసుమ, సంకీర్తన, ప్రత్యూష, కల్పన, శరణ్య తదితర చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని కంచరపాలెం మలుపు



తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం వెళ్లే దారిలోని మలుపు



చీకటిలో ప్రమాదకర ప్రయాణం

- ప్రమాదాలకు కారణమవుతున్న తాటిచెట్లపాలెం, కంచరపాలెం వద్ద గల మలుపులు
- ఎఫ్‌సీఐ గిడ్డంగి నుంచి లోకోషెడ్‌కు వెళ్లే రోడ్డుదీ అదే పరిస్థితి
- వెలగని విద్యుద్దీపాలు, కానరాని హెచ్చరిక బోర్డులు



ప్రమాదకర మలుపులో వాహనాల రాకపోకలు



ఊర్వశి కూడలి నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రహదారి మలుపు

కంచరపాలెం: కంచరపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారి, ధర్మానగర్, తిక్కవానిపాలెం మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అలాగే జ్ఞానాపురంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిడ్డంగి మీదుగా లోకోషెడ్‌కు వెళ్లే రహదారి కూడా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గాల్లో ప్రయాణమంటే వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు భయపడిపోతున్నారు. ధర్మానగర్, తిక్కవానిపాలెం, తాటిచెట్లపాలెం జాతీయ రహదారి, గంగన్ననగర్, జోగారావునగర్ రైల్వే క్వార్టర్స్, ఇటు కంచరపాలెం కూడలి ప్రాంతాలకు వెళ్లాలంటే పైన చెప్పుకున్న రహదారులనే వాహన చోదకులు వినియోగిస్తారు. అలాంటి రహదారులపైనే భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో వంద అడుగుల రహదారి 60 అడుగులకు కుదించుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే ఈ రహదారుల్లో విద్యుత్ లైట్లు లేకపోవడం, అధిక మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రైల్వే వాషింగ్ లైన్‌కు వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ చీకట్లో ప్రయాణమంటే స్థానిక కాలనీలకు చెందిన ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల ఈ మలుపుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అయితే ఈ మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్ కూడలికి రాకపోకలు సాగించే వాహన చోదకులు చీకట్లోనే ప్రయాణం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు ఏర్పాటు చేయకపోకడంతో ఈ బాధ తప్పడంలేదని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కానరాని హెచ్చరిక బోర్డులు..



కంచరపాలెంలోని పలు కూడళ్లు మలుపులతో ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పైగా ఆ ప్రాంతాల్లో విద్యుద్దీపాలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా మలుపుల వల్ల ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహన చోదకులు అయోమయానికి గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే మంచిది.

– బాలాజీ, లెక్చరర్, కంచరపాలెం

చీకట్లో ప్రయాణం బెంబేలెత్తిస్తోంది.



చీకటి పడితే తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లాలంటేనే భయమేస్తోంది. అయినా తప్పనిసరై ఈ రహదారినే వినియోగిస్తున్నాం. విద్యుత్ స్తంభాలున్నా లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుద్దీపాలు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలి.

– గంటా కామరాజు, తిక్కపానిపాలెం